

యోగ చిత్రప్రదర్శనకు స్పందన

సీజీసీ ఆధ్వర్యంలో విశాఖ సాగరతీరంలో నిర్వహిస్తున్న యోగా చిత్ర ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. 8లో



భవితలో తేలిన లెక్క..!

జిల్లాలో ఇప్పటికే 1,596 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉండగా, తాజాగా చేసిన సర్వేలో 318 మందిని గుర్తించారు. 8లో



గోదావరి డెల్టాకు సీలేరు జలాలు 8లో

ప్రైవేటు వల!



- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గాలం
- నామమాత్రంగానే 'నేనూ బడికిపోతా'
- 'విద్యా ప్రవేశ్'తోనైనా అడ్డుకట్ట పడేనా..
- ఈ ఏడాది లక్ష్యానికి ఆమడ దూరంలో ప్రభుత్వ స్కూళ్లు



రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థుల ప్రవేశాలు పొందే పాఠశాలగా విశాఖలోని చంద్రపాలెం జెడ్పీ హైస్కూల్‌కు పేరుంది. ఏటా ఇక్కడ వెయ్యి మందికి పైగా కొత్తగా ప్రవేశాలు పొందుతారు. కానీ ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 600 మంది వరకు చేరారు. ఇంకా చేరే అవకాశం ఉన్నప్పటికీ గత ఏడాది వరకు అయితే పాఠశాలల తెరిచిన తొలినాళ్లలోనే చంద్రంపాలెం హైస్కూల్లో సీటు కోసమని విద్యార్థుల నుంచి భారీగా డిమాండ్ ఉండేది. కానీ ఈ ఏడాది పరిస్థితి మరోలా ఉంది.



నగరంలోని మధురానగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గతేడాది 75 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 26 మంది మాత్రమే ప్రవేశం పొందారు. వివిధ తరగతులకు చెందిన మరో 20 మంది విద్యార్థులు టీసీలు తీసుకొని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోయారు. గత 12 ఏళ్లలో ఈ సమయానికి ఇంత తక్కువ అడ్మిషన్లు అయిన సందర్భం లేదని పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతేడాది లక్ష్యం చేరుకోవటం ఈ సారి కష్టమేనని అంటున్నారు.

ఈ ఏడాది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పరిస్థితి ఇలా ఉంది. మరోపక్క ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాల జోష్ కనిపిస్తోంది.

విశాఖ విద్య : జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు భారీగా తగ్గిపోతున్నాయి. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమై పన్నెండు రోజులు అవుతున్నా.. ఆశించిన స్థాయిలో ప్రవేశాలు నమోదు కాకపోవటంతో ఉపాధ్యాయులు తర్జన భర్జన పడుతున్నారు. 2023–24 విద్యా సంవత్సరం గణాంకాల మేరకు జిల్లాలో 1,389 మంది పాఠశాలలు ఉండగా వీటిలో 3,91,736 మంది విద్యనభ్యసించారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 608 వరకు పాఠశాలలు ఉండగా వీటిలో 90,866 మంది చదువుకున్నారు. అలాగే ఎయిడెడ్ స్కూళ్లలో 4,884 మంది విద్యనభ్యసించారు. 781 ప్రైవేట్ పాఠశాలల్లో మిగతా విద్యార్థులు ఉన్నారు. 2023–24 విద్యా సంవత్సరం లక్ష్యానికి మించి ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో అడ్మిషన్లు చేపట్టాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్దేశించారు. కానీ బడులు తెరిచి పన్నెండు రోజులు కావస్తున్నా.. అడ్మిషన్ల ప్రక్రియ లక్ష్యానికి ఆమడ దూరంలో ఉండటం విద్యాశాఖ వర్గాల్లో ఒకింత ఆలోచన మొదలైంది.



విశాఖ వ్యాలీ స్కూల్ ముందు అడ్మిషన్లు పూర్తయినట్టు పెట్టిన బోర్డు

ఈ తిరోగమనం ఎందుకంటే?

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచేందుకు 'నేనూ బడికి పోతా' అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. బడిఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాలనేది దీని లక్ష్యం. కానీ ఆశించిన ఫలితాలు కానరావటం లేదు. జిల్లాలోని చాలా వరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వేసవిలోనే ముందస్తు అడ్మిషన్లు చేపట్టాయి. కూటమి ప్రభుత్వంలో కుటుంబంలో ఎంతమంది చదువుకుంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు వస్తాయని ప్రైవేటు యాజమాన్యాలు విస్తృతంగా ప్రచారం చేశాయి. తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేసి విద్యార్థులను చేర్చుకున్నాయి. ఈ కారణంగా ప్రభుత్వ స్కూళ్ల నుంచి చాలా మంది టీసీలు తీసుకొని వెళ్లిపోతున్నారని ఉపాధ్యాయులు బాహాటంగానే చెబుతున్నారు. అయితే తల్లికి వందనం పథకం గురించి కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఊసేత్తకపోవడం విశేషం.

అక్కడ ఫుల్.. ఇక్కడ డల్..!

జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్లు కోలాహలంగా సాగుతున్నాయి. కొన్ని స్కూళ్ల ముందు అయితే 'అన్ని తరగతుల్లో సీట్లు ఫుల్' అయ్యాయని బోర్డులు సైతం పెట్టేశారు. కొన్ని పేరున్న ప్రైవేటు స్కూళ్లలో అయితే సీటు కోసమని రాజకీయ నాయకుల సిఫార్సులు చేస్తేనే కానీ దొరకటం లేదు. ప్రైవేటు స్కూళ్ల మోజు ఎలా ఉన్నా జిల్లాలో కొన్ని ప్రభుత్వ స్కూళ్లకు కూడా గతేడాది వరకు అడ్మిషన్లు బాగానే అయ్యేవి. కానీ ఈ ఏడాది ఎందుకిలా అనేది ఉపాధ్యాయుల్లో తర్జన భర్జన పడుతున్నారు. ప్రభుత్వ స్కూళ్ల పరిరక్షణ కోసమని సోమవారం నుంచి ప్రారంభించిన 'విద్యా ప్రవేశ్' కార్యక్రమంతోనైనా లక్ష్యం మేరకు అడ్మిషన్లు అవుతాయా..? లేదా.? అనేది వేచి చూడాల్సిందే.



క్లాక్‌టవర్.. జిగేల్

విశాఖ నడిబొడ్డున జగదాంబ కూడలిలో ఏర్పాటు చేసిన క్లాక్ టవర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం టవర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నగరంలోని ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జగదాంబ కూడలిలో క్లాక్ టవర్ ఏర్పాటు చేసింది. త్వరలోనే క్లాక్ టవర్ ప్రారంభం కానుంది. –డాబాగార్డెన్స్

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి కలెక్టర్‌గా మయూర్ అశోక్



మహారాణిపేట : జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ కె.మయూర్ అశోక్ సోమవారం ఉదయం 10.35 గంటలకు తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను పలువురు అధికారులు అభినందించారు. ఈనెల 22న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను ప్రభుత్వం బదిలీ చేస్తూ జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

కేజీహెచ్ గ్రేడ్‌-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పద్మావతి



పద్మావతిని అభినందిస్తున్న హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు

మహారాణిపేట: కేజీహెచ్ గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో గ్రేడ్ –2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన పద్మావతి కేజీహెచ్‌కు పదోన్నతిపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేజీహెచ్ నర్సింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు హెడ్ నర్స్, స్టాఫ్ నర్సులను, కాంట్రాక్ట్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పద్మావతికి అభినందనలు తెలిపారు.

రెండు ఆటోలపై కేసుల నమోదు



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

గోపాలపట్నం: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్కూల్ ఆటోలపై రవాణా శాఖ అధికారులు సోమవారం కేసులు నమోదు చేశారు. పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణిస్తున్న రెండు ఆటోలపై కేసులు నమోదు చేశారు. ఇంతవరకు 30 స్కూల్ బస్సులు, 18 ఆటోలపై కేసులు నమోదు చేసినట్టు రవాణాశాఖ అధికారులు తెలిపారు. మోటారు వాహన అధికారులు మాధవి, సుమన్ కుమార్ తదితరులు తనిఖీలు నిర్వహించారు.

29న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం

మహారాణిపేట : ఈ నెల 29న జిల్లా పరిషత్ ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈవో) ఎం.పోలినాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 29న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11 గంటలకు నాలుగు, మూడో స్థాయీ సంఘ సమావేశాలు, అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి, ఆరు, ఏడో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నందున సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

డాబాగార్డెన్స్: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేసిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్(జోన్–1 ఆపరేషన్స్) బి.అప్పలనాయుడు తెలిపారు. జోన్–1 పరిధి ద్వారకా బస్ స్టేషన్ నుంచి 12 ప్రత్యేక సర్వీసులు, అలాగే శ్రీకాకుళం, విజయనగరం నుంచి మరో 3 ప్రత్యేక సర్వీసులు విజయవాడకు నడపనున్నట్లు పేర్కొన్నారు. అలాగే వందే భారత్ రైలు ప్రయాణికుల కోసం విశాఖపట్నం నుంచి విజయనగరానికి రాత్రి వేళల్లో ప్రత్యేక సర్వీసు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు భేష్

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- ఇందిరా ప్రియదర్శిని స్టేడియం పనులపై సంతృప్తి
- త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



క్లాక్ టవర్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథన్



స్టేడియం ఆధునికీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన క్లాక్ టవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఫోకస్ లైటింగ్ ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం జోన్–4 పరిధి జగదాంబ జంక్షన్, ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ ఎంతో పేరున్న జగదాంబ జంక్షన్ కూడలిలో అందమైన ఆకృతులతో క్లాక్ టవర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో కూడా అందంగా ఉండేటట్లు విద్యుత్ దీపాలు.. అందమైన మొక్కలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీరు వినయ్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంను పరిశీలించారు. గ్యాలరీ పెయింటింగ్ అద్భుతంగా ఉందని కొనియాడారు. స్టేడియంలో గుంతలు లేకుండా సమాంతరంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రాంగణంలో టెన్నిస్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, కరాటే, జిమ్ మొదలైన కోర్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేడియం బయట గ్రీనరీ పెంపొందించడంతో పాటు నీడనిచ్చే గ్రాస్ ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజినీరు పీవీవీ సత్యనారాయణరాజును కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రసాదరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు సుబ్బారావు, సంతోషి, ఏసీపీ ఝాన్సీ, టీపీవో వినయ్ ప్రసాద్, హార్టికల్చర్ అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు.

జింబాబ్వే టూర్‌కు నితీష్‌కుమార్



విశాఖ స్పోర్ట్స్: జింబాబ్వేతో తలపడే భారత్ టీ20 జట్టులోకి నితీష్‌కుమార్ రెడ్డి చేరాడు. ఈ మేరకు బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ నితీష్‌కుమార్‌ను జట్టులోకి తీసుకున్నట్లు ప్రకటించింది. విశాఖకు చెందిన కె.నితీష్‌కుమార్ రెడ్డి భారత్ టీ20 జట్టులో స్థానం సాధించడం పట్ల ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్ర రెడ్డి అభినందనలు తెలిపారు. జింబాబ్వే టూర్‌లో రాణించాలని ఆకాంక్షించారు. సంఘం కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు నితీష్ కుమార్‌ను అభినందించారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : వెస్ట్ సెంట్రల్ రైల్వే, జబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

ఈ నెల 27, జూలై 4వ తేదీన విశాఖలో బయల్దే రాల్సిన విశాఖ–భగత్ కి కోటి (18573) వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, జూలై 6వ తేదీన భగత్ కి కోటిలో బయల్దేరాల్సిన భగత్‌కి కోటి–విశాఖ (18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్, జూలై 5,6,9 తేదీల్లో విశాఖలో బయల్దేరాల్సిన విశాఖ–అమృత్‌సర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, జూలై 6,7,10వ తేదీల్లో అమృత్‌సర్‌లో బయల్దేరాల్సిన అమృత్‌సర్–విశాఖ(20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దయినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం–అమృతసర్ (20807) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 25,28,29, జూలై 2వ తేదీల్లో మల్‌ఖేడి స్టేషన్‌లో హాల్ట్‌ను తొలగించారు.

యథావిధిగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్

విశాఖ–లింగంపల్లి–విశాఖ మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ యథావిధిగా కొనసాగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, లింగంపల్లి–విశాఖపట్నం(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 27వ తేదీ నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రైలు యథావిధిగా నడుస్తుందని, ప్రయాణికులు మార్పును గమనించాలని కోరారు.

20న గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు

- అన్నిశాఖలతో సమన్వయం
- కొండచుట్టూ 30 స్టాళ్ల ఏర్పాటు
- దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి



దేవస్థానం వైదికులు, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : వచ్చేనెల 20న గిరి ప్రదక్షిణను వైభవంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై దేవస్థానం వైదికులు, ఇంజనీరింగ్ అధికారులు, పలు విభాగాల అధిపతులతో సోమవారం ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, ప్రధానంగా నగరంలో 32 కిలోమీటర్ల మేర జరిగే ఉత్సవం కావడంతో అన్నిశాఖల సమన్వయంతో ముందుకువెళతామన్నారు. జీవీఎంసీ, పోలీస్, మెడికల్ తదితరశాఖల అధికారులకు లేఖలు రాయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. అలాగే దాతలు, స్వచ్ఛంద సంస్థలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. 20వ తేదీన సాయంత్రం 4గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద నుంచి పుష్పరథం ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ జరిగే పరిధిలో కొండచుట్టూ 30 స్టాళ్లను ఏర్పాటు చేస్తామని , 275 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో అన్నిశాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో దేవస్థానం స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, రాజేంద్రకుమార్, నరసింగరావు, సూపరింటెండెంట్లు రాజ్యలక్ష్మి, సునీల్, కనకరాజు, పీఆర్‌వో నాయుడు పాల్గొన్నారు.

జూలై 20, 21తేదీల్లో ఆర్జిత సేవలు రద్దు

గిరిప్రదక్షిణ సందర్భంగా జూలై 20, 21వ తేదీల్లో ఆర్జితసేవలన్నీ రద్దు చేస్తున్నట్టు దేవస్థానం స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ తెలిపారు. అలాగే దర్శనాల సమాయాల్లో కూడా మార్పులు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా 20న ఉదయం గిరిప్రదక్షిణ ప్రారంభించి రాత్రికే తిరిగి సింహాచలం చేరుకునే భక్తుల సౌకర్యార్థం ఆరోజు రాత్రి 10గంటల వరకు దర్శనాలు అందజేస్తామని తెలిపారు. అలాగే 21వ తేదీ తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4గంటల వరకు దర్శనాలు ఉంటాయని తెలిపారు.

3న జీవీఎంసీ దుకాణాల వేలం

డాబాగార్డెన్స్: జోన్–3 పరిధిలో గల పలు జీవీఎంసీ దుకాణాలకు జూలై 3న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోన్–3 జోనల్ కమిషనర్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జోన్–3 పరిధి సీతమ్మధార వాణిజ్య సముదాయం(పాతది) దుకాణం నంబరు 7, ఎంవీపీ కాలనీ వాణిజ్య సముదాయంలో గల దుకాణాలు 7, 10, 13, 14, 15, 16, డైమండ్‌పార్క్ వాణిజ్య సముదాయం(మొదటి అంతస్తు) దుకాణాలు 8, 9, జగ్గారావు బ్రిడ్జి వాణిజ్య సముదాయంలో దుకాణం నెంబరు 4 ఆశీల్‌కు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ తెలిపారు. పైన పేర్కొన్న వాణిజ్య సముదాయాల్లో గల దుకాణాలకు జూలై 3న ఉదయం 11 గంటలకు జీవీఎంసీ జోన్–3 జోనల్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలంలో ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రేమగా మాట్లాడండి.. సమస్యలు పరిష్కరించండి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్
- 237 వినతుల స్వీకరణ



ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదులు సమర్పించేందుకు వచ్చిన అర్జీదారులు

మహారాణిపేట : వివిధ సమస్యలపై వినతులు సమర్పించే అర్జీదారులతో ఆప్యాయంగా మాట్లాడాలని, వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించాలని జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. అనేక సమస్యలపై తమ వద్దకు వచ్చే ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి, సఖ్యతతో మెలగాలని సూచించారు. ప్రజలు అందించే వినతులను పూర్తిగా చదివి పరిష్కార మార్గం చూపాలన్నారు. అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించి ప్రజలకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని మయూర్ అశోక్ హితవు పలికారు. ఇదిలా ఉండగా సోమవారం జరిగిన కార్యక్రమంలో 237 వినతులు స్వీకరించారు. వాటిలో రెవెన్యూకు 79 ఉండగా, జీవీఎంసీకి 52, పోలీస్ శాఖకు 24, ఇతర సమస్యలకు సంబంధించినవి 82 ఉన్నాయి. ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి 72 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 72 వినతులు అందాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి మేయర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జీవీఎంసీకి సంబంధించి 72 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటిలో జోన్–2 నుంచి 6, జోన్–3 నుంచి 18, జోన్–4 నుంచి 5, జోన్–5 నుంచి 12, జోన్–6 నుంచి 16, జోన్–7 నుంచి ఒకటి, జోన్–8 నుంచి 6 ఫిర్యాదులు అందగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 8 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజా ఫిర్యాదులు నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజనీర్లు, ప్రధాన సిటీ ప్లానర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 66 ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వెంటనే పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో జేసీపీ ఫకీరప్ప, డీసీపీ–1 బి.లక్ష్మీనారాయణ, డీసీపీ(క్రైమ్) పి.వెంకటరత్నం, డీసీపీ–2 ఎం.సత్తిబాబు, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు పాల్గొన్నారు.

భవితలో తేలిన లెక్క..!

- ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే పూర్తి
- జిల్లాలో ఇప్పటికే 1,596 మంది పిల్లలు
- కొత్తగా 318 మంది సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల గుర్తింపు
- వారందరికీ సమీప పాఠశాలల్లో అడ్మిషన్లు
- భవిత కేంద్రాల వద్ద ఓపెన్ జిమ్‌లకు గ్రీన్ సిగ్నల్
- చిన్నారులకు ఆటపాటలతో చదువులు



గాజువాకలో కొత్తగా గుర్తించిన విద్యార్థులకు పాఠశాలలో చేర్పిస్తున్న ఐఈఆర్పీ

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్‌కు 'భవిత' కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయి. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వేసిన బలమైన పునాదులతో భవిత కేంద్రాలు బలోపేతం దిశగా అడుగులు ముందుకుపడ్డాయి. ఈ నేపథ్యంలోనే చాలా కాలం తరువాత సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన సర్వేలో ప్రత్యేక అవసరాల పిల్లలు మరికొంతమంది వెలుగులోకి వచ్చారు. జిల్లాలోని పదకొండు మండలాల్లో ఇప్పటికే 1,596 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉండగా, తాజాగా చేసిన సర్వేలో 318 మందిని గుర్తించారు. వీరందరికీ ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందేలా జిల్లా అధికారులు సమగ్ర నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు.

ప్రతీ ఒక్కరి లెక్క పక్కా:-

ప్రత్యేక అవసరాలు పిల్లలు ఎంతమంది ఉన్నారనే వాస్తవ లెక్క తెలియని పరిస్థితి. కానీ తాజాగా సచివాలయాన్ని యూనిట్‌గా సమగ్ర సర్వే చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన 1,596 మందితో పాటు, కొత్తగా గుర్తించిన 318 మంది ప్రత్యేక అవసరాల పిల్లలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించారు. ఆధార్ కార్డుకు అనుసంధానం చేస్తూ, ఆయా పాఠశాలల యు–డైస్ కోడ్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లల వాస్తవ గణాంకాల్లో పారదర్శకతతో పాటు, వారు ఎక్కడ చదువుతున్నారనేది తెలుసుకునే అవకాశం ఉంది.

భవిత కేంద్రాల్లో ఓపెన్ జిమ్‌లు

జిల్లాలో 11 భవిత కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాలకు 220 మంది వస్తున్నారు. శారీరక, మానసిక వైకల్యంతో ఉన్న పిల్లలు కావటంతో వీరికి ఆటపాటలతో చదువులు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే అవసరమైన ఆట పరికరాలు, వస్తువులను కేంద్రాలకు సమకూరుస్తున్నారు. దీనికి కొనసాగింపుగా జిల్లాలోని పదకొండు భవిత కేంద్రాల ప్రాంగణంలో ×ఓపెన్ జిమ్‌*లను ఏర్పాటు చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

జిల్లాలో భవిత కేంద్రాలు:-11
ప్రత్యేక అవసరాల పిల్లలు :-1,596
కేంద్రాలకు వచ్చే వారు:-220
ఇళ్ల వద్దనే సేవలు పొందే వారు:-110
పనిచేస్తున్న ఐఈఆర్పీలు:-22.
ఆయాలు:- 11, ఇద్దరు ఫిజియోథెరపిస్టులు

ఇంటివద్దనే సేవలు

ప్రతీ భవిత కేంద్రంలో ఇద్దరు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) లు అందుబాటులో ఉన్నారు. వీరితో పాటు ప్రతీ కేంద్రంలో ఒకరిని ఆయాగా నియమించారు. శారీరక వైకల్యం ఉన్న వారు ఎక్కువగా ఉన్నందున, వీరికి ఇంటి వద్దనే అవసరమైన వైద్య సేవలు అందించేలా ఫిజియోథెరపిస్టులను ఏర్పాటు చేశారు. ప్రతీ శనివారం ఫిజియోథెరపిస్టులు ఇళ్లను విద్యార్థుల ఇళ్లను సందర్శించేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకని చేపట్టిన సర్వేలో కొత్తగా 318 మంది నమోదయ్యారు. అందరికీ పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించాం. భవిత కేంద్రాల్లో 'ఇంద్రియ ఉద్యాన వనాలను' పెంచేలా ప్రత్యేక దృష్టిపెట్టాం. పెదగంట్యాడలో మోడల్‌గా తీసుకొని, అన్ని కేంద్రాల్లో అమలు చేస్తాం.

– బి. గీత, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్









బ్యాగ్‌లు బయట.. భవితవ్యం లోపల.!

జిల్లాలో డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయి. పుస్తకాల బ్యాగ్‌లు పరీక్ష కేంద్రాలకు అనుమతి లేకపోవడంతో విద్యార్థులు ఇలా బయటనే ఉంచేస్తున్నారు. బుల్లయ్య కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు తమ బ్యాగులను ఇలా చెట్లపైనా, ప్రహరీ గోడలపైనా, బైక్‌ల పైనా భద్రపరచుకుంటున్నారు.

అధ్యాపకులకు నాయకత్వ లక్షణాలు అవసరం



ఐఐఎంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌లో పాల్గొన్న అధ్యాపకులు

తగరపువలస: అధ్యాపకులు కేవలం బోధనపై దృష్టి పెట్టకుండా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్ రావు సూచించారు. ఆనందపురం మండలం గంభీరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఫ్యూచర్ లీడర్ షిప్ ప్రోగ్రాం పేరుతో ఐదు రోజులపాటు చేపట్టనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సోమవారం ఆయన ప్రారంభించారు. మాలవ్య మిషన్ టీచర్ ట్రెనింగ్ ప్రోగ్రాం, ఉన్నత విద్యాశాఖ, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర నిధులతో కూడిన ఫ్యాకల్టీల కోసం ఈ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ దేశంలో కేంద్ర నిధులతో కూడిన సంస్థల నుంచి 34 మంది అధ్యాపకులు శిక్షణలో పాల్గొన్నట్టు తెలిపారు. జాతీయ విద్యా విధానం 2020 కింద ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ఆవశ్యకతను తెలియజేశారు. భవిష్యత్ తరాలకు సమర్థవంతమైన నాయకత్వాన్ని, అవసరమైన సాంకేతిక నిర్వాహక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రస్తుతం, భవిష్యత్‌లో నాయకత్వ పాత్రలో అధ్యాపకులను శక్తివంతం చేయడం ఈ ప్రోగ్రాం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ అమిత్ భరణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



మహిళపై హత్యాయత్నం!

పరవాడ: కుటుంబ తగాదాల నేపథ్యంలో సత్యనారాయణ అనే వ్యక్తి ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కంపర సత్యనారాయణ తన కుటుంబంతో దేశపాత్రునిపాలెంలోని సాయినగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. సత్యనారాయణ కుమారుడు రమేష్ అదే గ్రామానికి చెందిన మట్ట యశోద కొంత కాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో యశోద పెళ్లి చేసుకోవాలని రమేష్‌పై ఒత్తిడి చేస్తుంది. కులాలు వేరు కావడంతో రమేష్ తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. దీనిపై యశోద పరవాడ పోలీసులను కూడా ఆశ్రయించింది. పెళ్లి విషయమై కొంత కాలంగా ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం పెళ్లి విషయమై తలెత్తిన వివాదంలో రమేష్ తండ్రి సత్యనారాయణ గర్భవతిగా ఉన్న యశోదపై కొడవలితో దాడి చేశాడు. యశోద మెడ భాగం, చేతిపై గాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం గాజువాకలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను కాపాడిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్



మహిళను రక్షించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్: ఆర్కేబీచ్‌లో కెరటాలకు కొట్టుకుపోతున్న మహిళ జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన వడ్లపూడి ప్రవల్లిక, ఆమె భర్త అప్పారావు ఆర్కేబీచ్‌కు వచ్చి స్నానానికి దిగారు. అలల తాకిడికి కొట్టుకుపోతున్న ప్రవల్లికను సమీపంలో ఉన్న జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ క ల్యాణ్, వెంకటేష్, ధనరాజు రక్షించారు. దీంతో బాధిత కుటుంబం లైఫ్‌గార్డ్స్‌కు కృతజ్ఞతలు తెలిపారన్నారు.

వినియోగదారుడిపై పెట్రోల్ బంక్ ఉద్యోగి దాడి



దాడికి పాల్పడుతున్న సతీష్

బీచ్‌రోడ్డు: పెట్రోల్ వేయించుకొని డబ్బులు ఇవ్వకుండా మరిచిపోయిన వినియోగదారుడిపై బంకు ఉద్యోగి దాడి చేశాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదినారాయణ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ వేయించుకునేందుకు సోమవారం సాయంత్రం రేసపువానిపాలెం దగ్గర ఉన్న పెట్రోల్ బంకుకు వెళ్లాడు. అక్కడ సతీష్ అనే బంకు ఉద్యోగి వాహనంలో పెట్రోల్ వేశాడు. అయితే అదినారాయణ డబ్బులు ఇవ్వడం మరిచిపోయి వాహనాన్ని ముందుకు తీశాడు. దీంతో వాహనాన్ని సతీష్ ఆపి ఆదినారాయణపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా ఆదినారాయణపై సతీష్ దాడి చేశాడు. ఇద్దరూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీబీసీ యోగ చిత్రప్రదర్శనకు విశేష స్పందన



చిత్ర ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

మహారాణిపేట: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విశాఖ సాగరతీరంలో నిర్వహిస్తున్న చిత్ర ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. సోమవారం ఆంధ్రాయూనివర్సిటీ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా యోగాసనాలు, యోగాక్రియలు, ప్రాణాయమంపై యోగా నిపుణులు హేమ, మల్లిక్‌లు శిక్షణ నిచ్చారు. ఎల్‌సీడీపై యోగాసానాలు, దేశభక్తి చిత్రాలు ప్రదర్శించడంతో విద్యార్థులు పెద్ద తరలివచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక యోగా విలేజ్ ఆవరణలో ఈ నెల 21 నుంచి 25 వరకూ యోగా చిత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రోజూ యోగా నిపుణులు సందర్శకులకు యోగా మెలకువలు నేర్పిస్తున్నారు. సమాచార, ప్రసార శాఖకు చెందిన కళాకారులు వివిధ కళారూపాలతో ప్రభుత్వ పథకాలు, యోగాపై ప్రదర్శనలిస్తున్నారు. జబర్దస్త్ ఫేం ప్రకాశ్, డేవిడ్ రాజ్, హేమ కళా ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని సీబీసీ సహాయ సంచాలకుడు షఫీ మహమ్మద్ తెలిపారు.

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు



రైల్వేపోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని సోమవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో, ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. హర్యానా రాష్ట్రం, పల్వాల్ జిల్లాకు చెందిన యోగేంద్ర సుమారు రూ.67,500 విలువైన 13.5కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గమనించి అదుపులోకి తీసుకొని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ మీదుగా ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీరావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పొట్లాలు తరలిస్తూ..



గోనె సంచిలో గంజాయి పొట్లాలు

సీతమ్మధార: గంజాయి పొట్లాలను గోనె సంచిలో తరలిస్తున్న మహిళను ఫోర్త్‌టౌన్ స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ గురుమూర్తి , ద్వారకా స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ అదుపులోకి తీసుకున్నారు. డెయిరీ ఫారం ఆదర్శనగర్‌లో నివాసముంటున్న మండేల శ్రీలత సోమవారం ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో సీతమ్మధార రాధాకృష్ణ లేఅవుట్ ప్రాంతంలో 300 గ్రాముల గంజాయిని పొట్లాలుగా చుట్టి గోనె సంచిలో తీసుకుని వెళ్తున్న క్రమంలో ముందుగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆమెను అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ద్వారకా పోలీసులకు అప్పగించారు. మహిళ సొంతూరు విజయనగరం జిల్లా జమ్ము నారాయణపురం. గతంలో త్రీటౌన్ ఏఎస్ఐ నైట్ రౌండ్స్ నిర్వహిస్తుండగా సదరు మహిళ అతడిపై తిరగబడిందని పోలీసులు తెలిపారు.

గోదావరి డెల్టాకు సీలేరు జలాలు విడుదల

మోతుగూడెం: సీలేరు కాంప్లెక్స్‌లోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాలో రబీ పంటలకు సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి రెండువేల క్యూసెక్కుల నీటిని ఏపీ జెన్‌కో అధికారులు విడుదల చేస్తున్నారు. డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం పవర్ కెనాల్ ద్వారా నాలుగువేల క్యూసెక్కులు గోదావరి డెల్టాకు వెళుతుండగా, మరికొంత నీరు కావాలని జల వనరుల శాఖ అధికారులు కోరడంతో విడుదల చేస్తున్నట్టు ఎస్ఈ కె.వి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్ నుంచి గోదావరి డెల్టాకు ఆరువేల క్యూసెక్కుల నీరువెళ్తున్నట్టు ఎస్ఈ తెలిపారు. మూడు రోజులపాటు డొంకరాయి నుంచి రెండువేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తామని తరువాత, రెండు రోజులు 1500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తామని ఆయన చెప్పారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో మన వాటాతో పాటు డొంకరాయి జలాశయం నీటితో కలిపి 12.5 టీఎంసీల నిల్వలు ఉన్నాయని ఎస్ఈ తెలిపారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.128
బ్రాయిలర్ (లైవ్)	: రూ.148
స్కిన్	: రూ.266
స్కిన్‌లెస్	: రూ.276

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	525.00
విజయనగరం	529.00
శ్రీకాకుళం	529.00

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,230
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,250
వెండి(కిలో):	రూ.96,200

శ్మశానవాటిక నుంచి మార్చురీకి మృతదేహం

- అంత్యక్రియలను అడ్డుకున్న పోలీసులు
- కేజీహెచ్ మార్చురీకి మృతదేహం తరలింపు

మహారాణిపేట: సాధారణంగా మృతదేహాన్ని మార్చురీ నుంచి శ్మశాన వాటికకు తీసుకువెళతారు. కానీ జ్ఞానాపురం శ్మశానవాటిక నుంచి మహిళా మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సోమవారం సాయంత్రం 24 ఏళ్ల గల మహిళ మృతదేహానికి గుట్టు చప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. మహిళ ఆత్మహత్య చేసుకుంటే సమాచారం ఇవ్వకుండా దహన సంస్కారాలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతనగరం పెదజాలారిపేటలో ఉంటున్న వాడమొదల అనూష(24)కు మధుతో తొమ్మిది నెలల క్రితం వివాహం జరిగింది. మధు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అనూష కేజీహెచ్ సమీపంలోని ఓ ప్రైవేటు దంత వైద్యశాలలో పనిచేస్తోంది. ఇటీవల అనూష తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి అనూష మానసికంగా కుంగిపోయింది. దానికి తోడు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఈ రెండు విషయాలను ప్రస్తావిస్తూ అనూష సూసైడ్ నోటు రాసుకుంది. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్కుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తరువాత చూసిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని కిందకు దించి గుండెలవిసేలా రోదించారు. సాయంత్రం జ్ఞానాపురం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తుండగా కాటికాపరి ప్రసన్న గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. దీనిపై అనూష బంధువులను విచారించగా పోలీసులకు సమాచారం ఇవ్వాలనే విషయం తమకు తెలియదని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గోవింద్



అనకాపల్లి: రాష్ట్ర ఆరోగ్య మిత్ర ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా చవ్వాకుల గోవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాకవరపాలెం మండలానికి చెందిన ఆయన్ను ఆదివారం విజయవాడలో జరిగిన నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మాకవరపాలెం ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న గోవింద్‌కు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని ఆరోగ్యమిత్రలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం, రోగులకు నాణ్యమైన వైద్యం అందించడం, న్యాయమైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని నూతన కమిటీని కోరారు.